ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ 15, పాడుగు వంకాయ 15, బెండకాయ 50, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 57, పచ్చకాకర 45, పందిరి బీర 45, క్యాబేజీ 26, క్యారెట్ 21, దొండ 35, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 45, గోకరకాయ 45, కీర 24, దోసకాయ 21, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 19, ఆలుగడ్డ 23, చామగడ్డ 50, మొరంగడ్డ 18, కందగడ్డ 60, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటి కాయ 11, మునగకాయ 4–6, ముల్లంగి 4–6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

నియామకం



నియామకపత్రాన్ని అందుకుంటున్న శివకుమార్

అడ్డగుట్ట: దళిత జర్నలిస్ట్ ఫోరం జిల్లా అధ్యక్షుడిగా దొమ్మాటి శివకుమార్ నియమితులయ్యారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కళపోగు జాన్ చేతుల మీదుగా ఆదివారం ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. దళిత జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈసారి ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా దళిత జర్నలిస్టుకు అవకాశం కల్పించాలని కోరారు. దళిత జర్నలిస్ట్ ఫోరం గౌరవ అధ్యక్షుడిగా బాబురావును కూడా నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్, రాజు, స్వామి, కృష్ణ, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలం.. భయం భయం!

- పెచ్చులూడుతున్న పాటిగడ్డ ఆర్ అండ్ బీ క్వార్టర్స్
- నిర్వహణ లేమితో చిట్టడివిని తలపిస్తున్న వైనం
- బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్న ఉద్యోగులు
- దృష్టి సారించని ఉన్నతాధికారులు



శిథిలావస్థలో ఆర్ అండ్ బీ క్వార్టర్స్

సనత్‌నగర్: ఏన్నో ఏళ్ల క్రితం నిర్మించిన క్వార్టర్స్‌లలోనే నివాసముంటూ బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు ఆ ప్రభుత్వ ఉద్యోగులు. వారి జీవనం దినదిన గండం నూరేళ్ల ఆయుష్ అన్నట్లుగా మారింది. అవి ఎప్పుడు కూలిపోతాయోనని భయం గుప్పిట్లో పెట్టుకుని కుటుంబంతో కలిసి జీవనం గడుపుతున్నారు. తాతల కాలం నాడు నిర్మితమైన క్వార్టర్స్‌లో బతుకు జీవుడా అంటూ కాలం వెళ్లదీస్తున్నారు. రోడ్లపై నిత్యం పొంగి పొర్లే డ్రైనేజీలు..వెలగని వీధిదీపాలు.. జనావాసాలే ఆవాసంగా విష సర్పాల సంచారం..క్వార్టర్స్ చుట్టూ అడవులను తలపించే రీతిలో చెట్ల పొదలతో అడవిలో బతుకున్నామనే భావన కలుగుతోందంటున్నారు బేగంపేట్ పాటిగడ్డ ఆర్ అండ్ బీ క్వార్టర్స్ ఉద్యోగులు.

నిర్వహణ లేక..

వివిధ డిపార్టమెంట్లలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగుల ఆవాసం కోసం గత 50 ఏళ్ల క్రితం బేగంపేట్ పాటిగడ్డలో అప్పటి ప్రభుత్వం ప్రత్యేక క్వార్టర్స్‌ను నిర్మించింది. రెండు విడతల్లో కలిపి 504 క్వార్టర్స్‌లలో అధికారుల కేటగిరీల వారీగా ఏ, బీ, సీ, డీ టైపు క్వార్టర్స్ నిర్మాణం జరిగింది. ఐఏఎస్ స్థాయి అధికారులకు ఏ టైపు క్వార్టర్స్, ఆ తర్వాత స్థాయిలను బట్టి బీ, సీ, డీ టైపు క్వార్టర్స్‌ను కేటాయించారు. సచివాలయం నుంచి వచ్చే ఆర్డర్స్ మేరకు ఉద్యోగులకు ఇక్కడ కేటాయింపులు జరుపుతారు. వారి వేతనాలను బట్టి హెచ్‌ఆర్‌ఏ కోత విధిస్తారు. ఆర్ అండ్ బీకి చెందిన స్థలంలో నిర్మాణాలు జరిపిన నేపథ్యంలో ఆర్ అండ్ బీ క్వార్టర్స్‌గా పిలుస్తూ వచ్చారు. వీటి మెయింటెనెన్స్‌ను కూడా ఆర్ అండ్ బీకే అప్పగించారు. రానురాను క్వార్టర్స్ నిర్వహణ అధ్వానంగా మారింది. గత పనిమిదేళ్లుగా ఒక్క మెయింటెనెన్స్ వర్క్ కూడా జరగలేదంటే పరిస్థితి ఏ మేర ఉందో అర్థం చేసుకోవచ్చు. క్వార్టర్స్‌కు సంబంధించి ఏదైనా పనులు చేయాలంటే ఉద్యోగులు ముందుగా అప్పీలు పెట్టుకుంటారు. ఆ మేరకు అంచనాలు తయారుచేసి నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాల్సి ఉంది. కానీ అప్పీలు తాలుకూ పనులు ఎక్కడా కూడా జరుగుతున్న దాఖలాలు లేవు. ఫలితంగా ఉద్యోగులే గత్యంతరం లేక పనులు చేయించుకుంటున్నారు.

నగానికి పైగా ఖాళీ..

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు చెందిన కొందరు క్వార్టర్స్‌కు ఖాళీ చేయగా..మరికొందరు ఇక్కడ మెయింటెనెన్స్ సరిగా లేక భయానక పరిస్థితుల కారణంగా వెళ్లిపోయారు. ముఖ్యంగా పాత క్వార్టర్స్ స్లాబ్ పెచ్చులు కూడా ఊడిపోతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. అలాగే ఖాళీగా ఉన్న క్వార్టర్స్‌ను అలాగే వదిలేయడంతో గుబురుగా చెట్లు పెరిగి చిట్టడవిని తలపిస్తున్నాయి. ఇదే ఆసరాగా చేసుకుని పలువురు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పిచ్చిమొక్కలు, చెట్ల పొదలు విపరీతంగా పెరిగిపోవడంతో పాములు సంచారం ఎక్కువైంది. ఆర్ అండ్ బీ స్థలంలో ప్రైవేటు వ్యక్తులు నిర్మించుకున్న ఇళ్లకు అసలు డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఏకంగా రోడ్ల మీదకే వదులుతున్నారు. దీంతో రోడ్లపై మురుగునీరు ప్రవహించడం నిత్యకత్యమే. క్వార్టర్స్‌లో సైతం ఎప్పుడో 50 ఏళ్ల క్రితం వేసిన డ్రైనేజీ పైప్‌లైన్లే ఉండడంతో తరచూ డ్రైనేజీ జామై కంపుకొడుతోంది.

మరమ్మతులకు బయటి నుంచే..

చిన్న చిన్న ఉద్యోగులైతే బయట వేలాది రూపాయలు అద్దెలు చెల్లించలేకపోవడం, సంజీవయ్యపార్కు రైల్వేస్టేషన్‌కు అత్యంత సమీపంలో ఉండడంతో రాకపోకలకు ఇబ్బంది ఉండదనే ఉద్దేశంతో చాలామంది ఈ క్వార్టర్స్‌ను వదలాలంటే ఆలోచిస్తున్నారు. కానీ నిర్వహణను గాలికొదిలేయడంతో శతకోటి సమస్యల నడుమ ఉద్యోగులు సతమతమవుతున్నారు. కనీసం ట్యాప్‌కు మరమ్మతులు చేయాలన్నా బయటి నుంచి పిలిపించుకుని చేయించుకోవాల్సిందే. పరిస్థితులు ఇలాగే ఉంటే మాత్రం మిగిలిన క్వార్టర్స్ సైతం ఖాళీ చేయక తప్పదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఉన్నతాధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన క్వార్టర్స్‌కు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం



క్రీడాకారులతో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

రసూల్‌పురా: గత తెలంగాణ ప్రభుత్వం క్రీడలు, క్రీడాకారుల ప్రోత్సాహానికి విశేషంగా కృషి చేసిందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. తిరుమలగిరి ఫుట్‌బాల్ మైదానంలో యూనిటీ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండవ కార్డినల్ కప్ ప్రైజ్‌మనీ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఫుట్‌బాల్ క్రీడ పూర్వవైభవం కోసం యూనిటీ స్పోర్ట్స్ అకాడమీ తీసుకుంటున్న చొరవ అభినందనీయమన్నారు. నిర్వాహకులు రేమాండ్ మాట్లాడుతూ.. జంటనగరాల్లోని పదహారు జట్లు పాల్గొంటున్నాయని గత నెల సీఎం కప్ దిగ్విజయంగా నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ చైర్మన్ లూయిస్ అరుణ్ రాజ్, అధ్యక్షులు ఎడ్వర్డ్, సెక్రటరీ మైకల్, అంథోని అబ్రహం, బోర్డు మాజీ సభ్యురాలు పి. భాగ్యశ్రీ, పాల్గొన్నారు.

అనిల్‌కుమార్‌కు అభినందనలు



రాంగోపాల్‌పేట్: కాంగ్రెస్ అధిష్టానం సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు అనిల్‌కుమార్ యాదవ్‌ను రాజ్యసభ సభ్యుడిగా ఎంపిక చేయడంపై కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను కలిసి అభినందించారు. గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షులు అల్లాడి గౌరిశంకర్, నందికంటి రవి తదితరులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. చిన్నవయసులోనే రాజ్యసభ సభ్యుడిగా ఎంపిక కావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బాబురావు, శివకుమార్, కేక్ శ్రీను తదితరులు ఉన్నారు.

పేద విద్యార్థులకు పూర్వ విద్యార్థులు చేయూతనివ్వాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో చదివే పేద విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు చేయూతనివ్వాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు నెల్లి సత్య విజ్ఞప్తి చేశారు. ఓయూలో చదివి దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడి యూనివర్సిటీకి కోట్ల రూపాయాలు విరాళంగా అందచేస్తున్న పూర్వ విద్యార్థులు సదస్సులు, సన్మానాలు, సంబరాలే కాకుండా పేద విద్యార్థులకు ఆర్థికంగా అండగా నిలవాలని కోరారు. ఫీజులు పెరిగి, ఫెలోషిప్, స్కాలర్‌షిప్ అందని విద్యార్థులకు ఓయూ పూర్వవిద్యార్థుల సంఘం అలూమ్నీ పేరుమీద నెలకు రూ.15 వేల ఫెలోషిప్ అందజేయాలని సూచించారు. ఓయూ బోధన, పరిశోధన కుంటుపడిందని రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి ఖాళీగా ఉన్న అధ్యాపక, బోధనేతర ఉద్యోగాల భర్తీకి కృషి చేయాలన్నారు.

క్రైస్తవులపై దాడుల సంస్కృతిని విడనాడాలి



జ్ఞాపికలు బహూకరిస్తున్న ఇలియాజ్ ఆర్ వాజ్

లాలాపేట: దేశంలో కొంత కాలంగా క్రైస్తవులపై దాడులు పెరిగిపోతున్నాయని చురుకుగా ఉన్న కొన్ని విద్రోహ శక్తులు రాజకీయాలు చేస్తున్నాయని పలువురు వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆల్ ఇండియా క్యాథలిక్ యూనియన్ వర్కింగ్ కమిటీ సమావేశాలు తార్నాకలోని సత్యోదయం రిట్రీట్ సెంటర్‌లో ఆదివారం ముగిశాయి. యూనియన్ జాతీయ అధ్యక్షులు ఇలియాజ్ ఆర్ వాజ్, ఉపాధ్యక్షుడు ఏ చెన్నప్పన్, సెక్రటరీ జనరల్ రఫేల్ డిసౌజా, ఆర్చ్ డయాస్ ఆఫ్ హైదరాబాద్ చాన్సలర్, ప్రొక్యూరేటర్ రెవరెండ్ ఫాదర్ ఇమ్మాన్యుయేల్ హాజరై దేశంలో క్రైస్తవులు ఎదుర్కొంటున్న వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశంలో శాంతికి భంగం కల్గించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని అనవసరమైన అంశాల్లో క్రిస్టియన్ మత గురువులు, సిస్టర్లను వేధిస్తున్నారని ఇలాంటి దాడుల సంస్కృతిని విడనాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులకు నిర్వాహకులు జ్ఞాపికలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మెల్విన్ బెనెడిక్ట్, కార్యదర్శి జేమ్స్ సిల్విస్టర్, ఫెబియన్ జోషప్ తదితరులున్నారు.

అప్రమత్తతకు మారుపేరు అగ్నిమాపక సిబ్బంది



ఫైర్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో అతిథులు

సనత్‌నగర్: ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లో నిర్మించిన సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్ నూతన భవనాన్ని ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మధుసూదనరావు, ఏడీఎఫ్‌ఓ సురేష్‌రెడ్డి, ఎస్ఎఫ్‌ఓ ప్రదీప్‌కుమార్ తదితరులు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎఫ్‌ఓ మాట్లాడుతూ.. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఎక్కడ అగ్ని ప్రమాదాలు జరిగినా ప్రాణ, ఆస్తి నష్టం జరక్కుండా చూడడంలో ఫైర్ సిబ్బంది ముందుంటారన్నారు. విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా బాధితుల ప్రాణాలను రక్షించడమే లక్ష్యంగా పని చేసేది ఒక్క ఫైర్ సిబ్బంది మాత్రమేనన్నారు. నూతన భవన నిర్మాణం కోసం కీలకంగా వ్యవహరించిన ఫైర్ ఆఫీసర్ ప్రదీప్‌కుమార్‌ను అభినందించారు. కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి మాట్లాడుతూ.. అగ్ని మాపకశాఖ సిబ్బంది అంటేనే అప్రమత్తతకు మారుపేరు అని, ఎప్పుడు ఎక్కడ ఏ ప్రమాదం జరిగినా క్షణాల్లో అక్కడకు చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ చేసి ప్రాణాలను కాపాడడంలో వారి పాత్ర ఎనలేనిదన్నారు.

సొంతగూటికి బీజేపీ శ్రేణులు



అంగముత్తు శ్రీనివాస్

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ ప్రాంతానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. ముఖ్య నాయకులతో జరిగిన చర్చలు సఫలం కావడంతో బీజేపీలో చేరడానికి మార్గం సుగమమైయింది. రెండు మూడు రోజుల్లో బీజేపీ తీర్థం పుచ్చుకోడానికి సిద్ధం చేసుకున్నారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం సమన్వయకర్త రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి సమక్షంలో తిరిగి బీజేపీలో చేరుతున్నారు. బీఆర్ఎస్ నాయకులు అంగముత్తు శ్రీనివాస్(ఐడీహెచ్ కాలనీ), ఎం. శ్రీనివాస్, పద్మారావునగర్ ప్రాంతానికి చెందిన కిషన్, నర్సింగ్‌రావులు బీజేపీలో చేరడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. సదరు నాయకులు అసెంబ్లీ ఎన్నికలకు ముందు నాటి మంత్రి, నేటి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సమక్షంలో బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరే కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే ఐడీహెచ్ కాలనీలో ఏర్పాట్లు సిద్ధం చేశారు. భారీ ఎత్తున ఐడిహెచ్ కాలనీ వేదికగా బీజేపీలో చేరుతున్నట్లు అంగముత్తు శ్రీనివాస్ ఆదివారం విలేకరులతో చెప్పారు.

నరేంద్ర మోదీతోనే దేశాభివృద్ధి



ప్రచారం చేస్తున్న శ్రీగణేష్, కార్పొరేటర్ దీపిక

రాంగోపాల్‌పేట్: ప్రధానిగా మోదీ మరోసారి అధికారంలోకి వస్తేనే దేశం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని కంటోన్మెంట్ నియోజకవర్గ బీజేపీ నాయకులు శ్రీగణేష్ అన్నారు. ఆదివారం బస్తీ చలో అభ్యాన్ కార్యక్రమంలో భాగంగా మోండా డివిజన్‌లోని డొక్కలమ్మ దేవాలయం పరిసర ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేస్తూ మాట్లాడారు. పదేళ్ల కాలంలో దేశ ప్రజల భద్రతకు మోదీ భరోసా కల్పించారని దేశాన్ని అన్ని రంగంలో అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు ప్రపంచంలో భారతదేశ ప్రతిష్టతను పెంచారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వీరవర్ధన్‌గౌడ్, శ్రావణ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ స్థలాన్ని కాపాడుకుందాం



మాట్లాడుతున్న మురళి ముదిరాజ్

రసూల్‌పురా: రెండు వందల ఏళ్ల చరిత్ర గల తిరుమలగిరి మహంకాళి అమ్మవారి ఆలయం స్థలం కబ్జా కాకుండా ప్రతి భక్తుడు కదలిరావాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు మురళి ముదిరాజ్ పిలుపునిచ్చారు. శనివారం రాత్రి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఆలయ ఆవరణ స్థలం కొన్నామని ప్రకటించుకున్న వ్యక్తి తండ్రి, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు ప్యారసాని గౌరిశంకర్ గతంలో ఆలయ స్థలం కబ్జా కాకుండా తమకు సహకరించారని అందరం కలిసి తరిమేశామని గుర్తు చేశారు. ఈసారి వారి కుటుంబ సభ్యులే ఆలయ స్థలం అన్యాక్రాంతం చేస్తున్నారని ఈ విషయమై పోలీస్, దేవాదాయశాఖ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆలయం స్థలం కబ్జా అవుతున్న విషయం ప్రతి గడపకు వెళ్లి వివరిస్తామని సేవ్ టెంపుల్ ల్యాండ్ కార్యక్రమం పేరుతో శాంతియుతంగా పోరాటం చేసి స్థలాన్ని సాధించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తవత్సలం, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడోత్సవం



ప్రతిభ కనబర్చిన చిన్నారులతో డైరెక్టర్లు

సనత్‌నగర్: ఎస్ఆర్‌నగర్ అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ వార్షిక క్రీడోత్సవం ఉత్సాహంగా జరిగింది. ఫీల్డ్స్ ఆఫ్ పీస్టా పేరిట యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన ఈ ఉత్సవంలో చిన్నారులు వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ చాటారు. ముందుగా నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్ ఆకట్టుకుంది. అనంతరం పాఠశాలలోని హౌస్‌ల వారీగా నిర్వహించిన ఈవెంట్స్‌లో చిన్నారులు ప్రతిభ కనబర్చగా వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బచ్‌పన్ అండ్ అకాడమిక్ హైట్స్ అకాడమిక్ డైరెక్టర్లు కౌశిక్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, ఇందులతారెడ్డి, ప్రిన్సిపాల్ నీరజ్ కక్కర్ పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక గ్యార్వీ



గ్యార్వీ ఉత్సవాల్లో పాల్గొన్న కార్పొరేటర్ హేమలత, పవన్‌కుమార్

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బోయిగూడ కళారంగ్ కాలనీలోని గౌస్ ఏ–పాక్ చిల్లా వద్ద గ్యార్వీ ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అనేక మంది చిల్లా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ 10వ ప్లాట్ ఫామ్ వద్ద నున్న దర్గా నుంచి పవిత్ర జెండాను ఒంటేలపై పట్టుకొని ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పండుగలు మతసామరస్యానికి, మానవ విలువలకు ప్రతీకగా నిలువాలన్నారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత, బీఆర్ఎస్ ఇన్‌చార్జి పవన్‌కుమార్ గౌడ్, నిర్వాహకులు ఎండీ అస్లమ్, ఉమరుద్దిన్, ముర్తుజా, అల్తాఫ్, జావేద్, విజయ్, జర్నలిస్ట్ బి. నర్సింగ్‌రావు, కళావతి, గౌసియా బేగం పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

సనత్‌నగర్: జెక్‌కాలనీలోని పార్థివ్ లంగ్‌కేర్ సెంటర్ ఆధ్వర్యంలో సనత్‌నగర్‌లోని కంజర్ల లక్ష్మీనారాయణ యాదవ్ పార్కులో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన వచ్చిందని నిర్వాహకులు పేర్కొన్నారు. వైద్య నిపుణులు డాక్టర్ నాగరాజ్ పర్యవేక్షణలో వైద్య సిబ్బంది దాదాపు 300 మందికి అన్ని రకాల శ్వాసకోశ సంబంధిత, మధుమేహ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాజ్ మాట్లాడుతూ.. శ్వాసకోశ సంబంధిత సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని ఎలాంటి సమస్య తలెత్తినా వెంటనే వైద్యులను సంప్రదించి వారి సూచనలను పాటించాలన్నారు. క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించుకోవడం, పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా శారీరక సమస్యలు తలెత్తకుండా చూసుకోవచ్చన్నారు. అదే విధంగా వ్యాయామం చేయడం, మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడం వల్ల రుగ్మతలు దరిచేరకుండా ఉంటాయన్నారు. ముఖ్యంగా మధుమేహం విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. బీఆర్ఎస్ సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి హాజరై శిబిరం నిర్వహించిన పార్థివ్ లంగ్‌కేర్ సిబ్బందిని అభినందించారు.

ప్రమాదకర స్తంభాన్ని మార్చాలి



బౌద్ధనగర్: ఈశ్వరీబాయి నగర్‌లో ప్రమాదకరంగా స్తంభాన్ని తొలగించి నూతన స్తంభం ఏర్పాటు చేయాలని బస్తీవాసులు కోరుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్వరలో ఈశ్వరిబాయి నగర్‌లో నూతనంగా డ్రైనేజీ పైప్‌లైన్, సీసీ రోడ్డు పనులు చేపట్టనున్నారని బస్తీలో వికాస్ పబ్లిక్ స్కూల్‌కు ఆనుకొని ప్రమాదకరంగా ఉన్న ఇనుప స్తంభాన్ని తొలగించి సిమెంట్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు వేసిన తర్వాత స్తంభాన్ని మార్చడంలో ఇబ్బందులు తలెత్తుతాయని, ముందస్తుగా ఇనుప స్తంభాన్ని మార్చాలని ఏఈకి వినతిపత్రం ఇచ్చినట్లు నర్సయ్య, అనురాధ, రాజు, కిరణ్ తెలిపారు.

పెళ్లి చేసుకుంటానని యువతిపై లైంగిక దాడి

కేసు నమోదు

అమీర్‌పేట: పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. వైఎస్ఆర్ జిల్లా మైదుకూరుకు చెందిన చంద్రగుప్తా ఎస్ఆర్‌నగర్‌లో సోదరుడితో కలిసి ఆయుర్వేదిక్ మందుల షాపు నిర్వహిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన 28 ఏళ్ల యువతిని 2021 నుంచి ప్రేమిస్తున్నానంటూ వెంటపడ్డాడు.పెళ్లి చేసుకుంటానని నమ్మించిన అతడు యువతితో పాటు ఆమె తల్లిదండ్రులను కూడా నగరానికి రప్పించాడు. జగద్గిరిగుట్టలో ఓ గదిని అద్దెకు తీసుకుని వారిని అందులో ఉంచాడు. 2022లో అమీర్‌పేట ప్రాంతంలో మరో గదిని అద్దెకు తీసుకుని అక్కడికి మార్చాడు. గతేడాది డిసెంబరు 8న తల్లి ఇంట్లో లేని సమయంలో ఇంటికి వచ్చిన చంద్రగుప్తా యువతిపై అత్యాచారం జరిపాడు.మరోసటి రోజు ఆసుపత్రికి తీసుకువెళ్లి గర్భం దాల్చకుండా బలవంతంగా మందులు వేయించాడు. తర్వాత తనను పెళ్లి చేసుకోవాలని యువతి అడిగినా కొంత కాలం ఆగాలంటే మాట దాటవేస్తూ ఇటీవల కనిపించకుండా పోయాడు.చంద్రగుప్తా తల్లిదండ్రులు సైతం యువతి, ఆమె తల్లిదండ్రులను బెదిరించడం ప్రారంభించడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తార్నాకలో కుక్కల బెడద



గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలోని ప్రజలను గత కొంత కాలంగా కుక్కల బెడద వేధిస్తుంది. తార్నాకలోని కేపాల్ బోన్ సెట్టింగ్ వీధిలో గుంపులు గుంపులుగా సంచరిస్తూ పాదచారులు, ద్విచక్ర వాహనదారులపై దాడులకు తెగబడుతున్నాయి. లాలాపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియంలో విచ్చలవిడిగా సంచరిస్తూ భయాందోళనకు గురి చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. స్టేడియంలోని మెట్లు, టెర్రాస్‌పై తిష్టవేసి వాకింగ్ కోసం వచ్చిన వారిపై దాడి చేస్తున్నాయి. గతంలో వినోభానగర్‌లో ఓ విద్యార్థిని కుక్క గాయపర్చింది. ఇటీవల సికింద్రాబాద్‌లో జరిగిన ప్రజావాణిలో సైతం కుక్కల సమస్యపై ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన డిప్యూటీ మేయర్ సైతం కుక్కల బెడద సమస్యను పరిష్కరించాలని ఆదేశాలిచ్చినా అధికారులు స్పందించకపోవడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మాలలకు భాగ్యరెడ్డి వర్మ ఆదర్శం



భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: మాలలకు భాగ్యరెడ్డి వర్మ ఆదర్శమని ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) ఓయూ అధ్యక్షులు నాను సైదులు పేర్కొన్నారు. ఆదివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట భాగ్యరెడ్డి వర్మ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. హైదరాబాద్ నిజాం సంస్థానంలో విద్యా మంత్రిగా పనిచేసి దళిత బాలికల కోసం 26 పాఠశాలలను స్థాపించి మహిళల విద్యావ్యాప్తికి కృషి చేశారని కొనియాడారు. భాగ్యరెడ్డి వర్మను నేటి పాలకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో దుర్గం వినోద్, కరుణకర్, గోవర్ధన్, హరికృష్ణ, నగేష్ పాల్గొన్నారు.

రేవంత్ పదేళ్ల పాలనకు మేడారానికి పాదయాత్ర

ఉస్మానియా యూనివర్సిటీ: సీఎం రేవంత్ రెడ్డి రెండు విడతలుగా పదేళ్ల పాటు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ప్రజలకు సేవలందించాలని ఓయూ జేఏసీ చైర్మన్ ఒరుగంటి కృష్ణ ఆధ్వర్యంలో మేడారానికి పాదయాత్ర చేపట్టారు. ఆదివారం ఆర్ట్స్ కాలేజీ నుంచి మేడారం సమ్మక్క–సారలమ్మ దేవతల వద్దకు కాలినడకన బయలుదేరారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై విమర్శలు మానుకొని రాష్ట్ర అభివృద్ధి కోసం సహకరించాలని బీఆర్ఎస్ నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో సురేష్‌లాల్, యాదగిరి, నరసింహ, సురేష్, సాయి, యాదగిరి, నగేష్, వంశీ పాల్గొన్నారు.